# అసహాయుని హాహాకారం

"శ్రీ విరించి"

ఒక గొంతు: నేను బ్రతికిచెడ్డ వాడిని! ఈ ప్రపంచం అంటే నాకు తీరని అసహ్యం పుట్టుకొస్తూన్నది.

మరో గొంతు: నువ్వెక్కడో పిచ్చివాడి లాగున్నావు. ప్రపంచం అంటే అసహ్యం పుట్టుకు రావడమేమిటి ?- స్వర్గంలో నన్నా యిన్ని సుఖాలు వుంటాయా అని అనుమానం కలుగుతూన్నది నాకు. యేమో గ్యారంటీ యివ్వలేను. 'స్వర్గం' మనం చూచామా యేమన్నానా ? ఇది స్పష్టంగా కన్పిస్తూన్నది. ఇన్ని సుఖాలు! నాకు కర్మ సిద్ధాంతంలో యేమాత్రమో నమ్మకం వున్నది గనక చెబుతున్నాను. యీ సుఖాల మధ్య, యీ శోభాయమానమైన వస్తువులమధ్య మనం వుంటోన్నామంటే ఏ పూర్వజన్మ సుకృతమో. ఏ పూర్వ పుణ్యాలకో ఫలంగా యీ ప్రపంచంలో ప్రియురాలితో సుఖపడటానికి అవకాశం కలిగింది.

మొదటిగొంతు: అపు నీధోరణి! ఈ ధోరణిలో కొట్టుకు పోయేట్టున్నాను. నువు చెబుతూన్నది నీకు వర్తించవచ్చు. నాకీ కర్మసిద్ధాంతాలు నచ్చవు. చూడు, నీ పేరేమిటో.

రెండోగొంతు: నా పేరు వైకుంఠరావులే.

మొదటిగొంతు: పేరులో యేమున్నదిలే. వైకుంఠరావు పేరుకేం నిక్షేపంలాటిది. కాని చూచావూ, వైకుంఠాన్ని గురించి ఆలోచించవు యీ ప్రాపంచిక సుఖాల్లో మునిగిపోయి. నా పేరు అడక్కపోయినా చెబుతాను, నన్నంతా శ్రీనివాసరావు అంటారు. రకంవారీగా కొందరు వెధవనీ, శుంఠ అనీ, మూర్ఖుడనీ, పిలుస్తున్నారనుకో. ఉదాహరణ కోసమేగాని, నన్ను మెచ్చుకునే వాళ్ళూవున్నారు. అయితే యేం లాభం. పూరికే మెచ్చుకుంటే యేమయింది ? ఒక్క 'కానీ' యివ్వ సంసిద్ధులెవరూ లేరు. నన్ను గురించి నేను చెబుకుంటే బాగుండదుగాని.

వైకుంఠరావు: అదేమున్నమాట? ఎవర్ని గురించి వాళ్ళు చెబుకోకపోతే యెట్లా?

శ్రీనివాసరావు: పోనీ అట్లానేకానీ, మన్లో మాట- నువ్వు శ్రద్ధగా వింటున్నావు గనక చెబుతున్నాను. నేను- నేనంటే యెవరికీ శ్రద్ధలేదు. ఎవరూ నన్ను శ్రద్ధగా చూడరు. మర్యాదచెయ్యరు.

వై: నీమాట వింటూంటే నాకు ఆశ్చర్యంగా వుంది.

శ్రీ: ఎందుకు? నే చెపుతున్నది అక్షరాలా నిజం! కాకపోతే యెవరిచేతయినా అనిపించు, నన్ను మర్యాదగా చూస్తానని!

వై: అసలు నిన్నెందుకు మర్యాదగా చూడాలి? దానికితగ్గ అర్హత నీలోయేమున్నది?

శ్రీ: బాగుందే! మర్యాదగా చూడబడటానికి నేనో మనిషిని! బ్రహ్మ అందర్నీ పుట్టించినట్లే పుట్టించాడు! మా జమీందారూ నేనూ వొక్క నిమిషం వ్యత్యాసంగా పుట్టామంటే! ఒక్క నిమిషానికే యింత వ్యత్యాసమా? మనిషికి అతీతంగాని ప్రతిపనీ నేను చేయగలను. ఒకసారి ఒక వుదయాన్నే లేచి, పట్టెడన్నమేనా తినకండా పద్ధెనిమిది మైళ్ళు నడిచి బెజవాడ చేరుకున్నాను. నేను యెంతసేపయినా కూర్చుని వుండగలను.

వై: నేనడిగింది నీ విద్యార్హతలు. ఇవన్నీ యెందుకు?

శ్రీ: అట్లానా? తెలుగులో ప్రచురితమైన పుస్తకాల్లో మూడొంతులకి తక్కువ లేకండా చదివాన్నేను. ధారాళంగా మాట్లాడగలను, రాయగలను. ఎంతటి కఠిన పదానికైనా నిమిషంలో అర్థం చెప్పగలను. తరవాత—

వై: నువ్వేపరీక్షయినా ప్యాసైనావా?

శ్రీ: కనీసం ఆ వ్యామోహం నాకు లేదు. తలుచుకుంటే యీపాటికో యెమ్మే అవ తాహతున్నది, గాని-

వై: అబ్బాయ్, ఈకాలంలో తల్చుకోవటం పనికిరాదు. అయితీరాలి! ...అయితే ఏపరీక్షా ప్యాసవలేదన్నమాట ...!

శ్రీ: ఈ జీవితంలో నేను పరీక్షలు ప్యాసు కాదల్చుకోలేదు. పట్టి చెత్త విజ్ఞాన వికాసాలకు యేమాత్రమూ వుపయోగించని ...

వై: ఆగు. విద్యావిధానంమీద నీ విమర్శ కూడా యెందుకులే.

శ్రీ: సరిగ్గా ఆమాటే ముగ్గురు నలుగురు నాతో అన్నారు. చూచావూ-విమర్శించటానికి డిగ్రీలు అక్కర్లేదు.

వై; ఏమో లే, పో నీ- నువ్వేమంటావు యింతకీ.

శ్రీ: ఏమంటాను? ప్రపంచాన్ని తిట్టిపోస్తాను. నిలచున్న పళాన్ని.

వై: ఎందుకు?

శ్రీ: ఎందుకా? ఎందుకేమిటి, ప్రతిదానికీ. నన్ను పోషించలేని యీ ప్రపంచం-నన్ను బ్రతికించుకోలేని యీ ప్రపంచం- నన్ను నిలబెట్టుకోలేని వెధవ ప్రపంచం...

వై: నువు యేదో యిష్టు లాగున్నావే. తెలివి ముదురుపాకాన బడ్డది. నిన్ను ప్రపంచం ఎందుకు పోషించాలి? ఎందుకు బతికించాలి? ఎందుకు నిలబెట్టుకోవాలి?

శ్రీ: పుట్టానుగనుక - పుట్టించుకున్నదిగనక. నారుపోసినందుకు, నీరు పొయ్యద్దూ? అయినా నేను సామాన్యుడిని గాకపోతిని-

వై: ఇదొకటా? సామాన్యుడిని మించిన లక్షణాలు నీలో యేమున్నై? చెప్పు—

శ్రీ: వివాదం అనవసరం! నాలోవున్నై. అది మాత్రం నువ్వు వొప్పుకోక తప్పదు.

వై: పోని నాకు టైంలేదు. వెళిపోతాను, సెలవ్ ...

శ్రీ: వీడెక్కడి మనిషి! సొంతం వింటాడనుకున్నాను. ఇంత అకస్మాత్తుగా లేచిపోతాడనుకుంటే అసలు నాగోడవే యెత్తకపోదును! సగంలో ఆపేస్తిని, నా మనసేం శాంతి పొందినట్టు? శాంతి ఇవ్వలేనివాళ్లు యీ ప్రపంచంలో వాళ్ళంతా. నాక్కావలసినవి దప్ప తక్కిన వన్నీ ఇక్కడ వున్నాయి. నాక్కావలసిన సుఖం ఎక్కడవున్నదని వెదకను? ఈ ప్రపంచంలో అది వున్నదో లేదో నాకు తెలియదు. కాని వుండే వుంటుందని నమ్మాల్సివస్తున్నది, ఈమనుషుల అరుపులు వింటోంటే. దొరికినా, దొరక్కపోయినా వెదకటం నావిధిగా భావించుకుంటాను. నా శ్రమంతా వృథా అవాల్సిందేనా?

పెద్దగొంతు వొకటి: ఎవరక్కడ? ఇక్కడెవరూ తిరగ్గూడదు. అంతా వెళ్లిపోండి. ఊ, వెళ్లండి.

శ్రీ: నేను పుట్టిన యీ ప్రపంచంలో, నా యిష్టమైనచోట నించోటానికిలేదు. ఎవరో, నాకుతెలీనివాళ్లు వచ్చి నన్నవతలకి గెంటేస్తారు. వాళ్ళకా అధికారం వున్నదిటమరి! పుటుతూనే వస్తుందా అది? అయితే నాకురాలేదేం? నా కెవ్వర్నీ మాటాడించడానికే లేదే? 'ఊ' అంటేతప్పు, 'ఆ' అంటేతప్పు. 'నారాయణా' అంటే బూతుమాట అయితీరుతుంది నా విషయంలో.

పై పెద్దగొంతు: ఇంకా యెవరక్కడ, మూలుగుతున్నారు? వెళ్లిపొమ్మని చెబుతోంటే వినిపించడంలేదా? ఇక్కడేంపని యీ వేళప్పుడు.

శ్రీ: ఇక్కడగాక మరెక్కడా నాకు పని లేదు. నాకుచెవుడేవిటి? ఎంతఅరచినా దూరాన్నించే వినగల్ను. నాక్కావలసిన అరుపులు వినిపించవుగాని.

పై పెద్దగొంతు: ఏయ్ మనిషీ! ఇక్కడెవరూ వుండరాదు- వెళ్లిపో.

శ్రీ: నయం, 'పందీ' అన్నావుగాదు. నీ నోటి కడ్డేమిటి? నీ మాటప్రకారం వెళ్లిపోతున్నాలే.

అయినా యెక్కడికని వెళ్లను. నా కోసం యెవరు నిరీక్షిస్తున్నారు గనక? నేనంటే ఎవరు పడి చస్తున్నారు గనక? కాని, యిక్కణ్ణించి వెళ్ళిపోక తప్పదు గదా ...

తుదీ మొదలూ లేని—

ఒక వ్యక్తి: ఏమిటి దేవుడిని ప్రార్థిస్తున్నారా? ఆది మధ్యాంతాలులేవు ఆయనకు, మీరు రెండే అంటున్నారుగాని ...

శ్రీ: నాభావం మీరు సరిగా పసికట్టలేదు. తుదీ మొదలూ యెప్పుడైతే లేవో, మధ్యా

వుండదు అప్పుడే. అది ప్రత్యేకంగా చెప్పవలసిన అవసరమేమిటి? అయినా నేనిప్పుడు దేవుడిని అనటంలేదు. నాకసలు దేవుడితో పనేమిటి? తీరా యేపనన్నా వున్నప్పుడు ఆయన కనిపిస్తాడు గనకా? వట్టి భ్రమ.

వ్యక్తి: నువెక్కడో నాస్తికుడల్లేవున్నావే. రా, నీతో వాదిస్తాను.

శ్రీ: నేను నాస్తికుడినని నీతో అనలేదు. వాదించటానికి నాకు వోపికలేదుగూడా. ఫలం శూన్యం అయిన కార్యాలు నేనేమీ చెయ్యను. నాకొక్కవలసిన ధోరణిలోని మనుషుల్ని పట్టుకోలేక పోతున్నాను.

వ్యక్తి: పోతావేమిటి? దేవుడున్నాడని నీ చేత వొప్పించిగాని, నేనిక్కడినించీ కదలదల్చుకోలేదు.

శ్రీ: తిరుగులేని ప్రతిజ్ఞ! దేవుడున్నాడు. ఇక్కడినించి కదలిపో.

వ్యక్తి: అదీమాట!

శ్రీ: ఇపుడెక్కడికి వెళ్లను? శాంతి దొరికే సీమల్లో విహరిద్దామనే నా ఆశ అణగారి పోవలసిందేనా?

పేపరు చదువుతున్న ఒక గొంతు: మూడో ప్రపంచయుద్ధం ముంచుకు వస్తున్నది. యుద్ధ విరమణకు ప్రముఖులు చేసిన యత్నాల వైఫల్యం. అతి త్వరలో ముఖ్య పట్టణాలలో ఆటం, ఉదజని బాంబుల ప్రయోగం సాధ్యమట! నష్టమయే జనసంఖ్య, ఆస్తి పాస్తుల లెక్క అపుడే గుణించబడినవని విదేశాంగ నీతి మంత్రి ప్రకటన. యుద్ధ రంగాలలో ప్రవేశించటానికి సైన్యం సంసిద్ధమై వున్నది.

శ్రీ: ఇదేమిటీ? విచిత్రం! ఎవరా యుద్ధకాముకులు? నాకూ అంతులేని సైన్యం వుంటే బాగుణ్ణు. ప్రపంచాన్నంతా జయింతును! ప్రపంచాన్నంతా జయించి, 'శాంతి' స్థాపించి యీ మానవ జన్మం యేమిటో, నే వెదికేదాని సాఫల్యం యేమిటో కనుగొందును. అయితే వాళ్లు యుద్ధం యెందుకు చేస్తున్నట్టు? నాలాటి వాళ్లేనా వాళ్లు? నాబోటి అసహాయులీ ప్రపంచంలో ఇంకా వేనవేలు వున్నారా? అబద్ధం. సందిగ్ధంలో వుండేవాళ్ల సంఖ్య విపరీతంగా వుండి వుండదు. దానికి మరో కారణం వుండొచ్చు నాకు తెలియనిది. అంతేకాని—

ఒక గొంతు: యుద్ధం వొస్తుంది. మనదేశం యే పక్షం వహిస్తుందో!

శ్రీ: యుద్ధానికి రెండు పక్షాలు అవసరం! యుద్ధానికీ నాకూ సంబంధం యేమిటి? నాకీ రోజు తినతిండీ, కట్టబట్టా సరిగ్గా లేకే, దీనికెవరు బాధ్యులూ అంట? ఈ యుద్ధం రావడం వృత్తి పుణ్యానికే. దానిదారినది వొచ్చిపోతే ఫరవాలేదు. మనందరి నెత్తినా రాళ్లు పడేసిగాని పోదు. కరువు, కాటకం! రూపాయికి ఏసరుకూ రాదు. వందలూ వేలూ కలవాళ్ళదే రాజ్యం. కొస్త పొలం వున్నవాళ్లు గూడా కొమ్మెక్కి కూర్చుంటారు, దయ్యాల్లాగా! ఇంతకూ...

పై గొంతు: చూడగా చూడగా మీరేదో తీవ్ర సమస్యతో బాధపడుతున్నట్లున్నది. నేనేమైనా సహాయం చేయగలనేమో!

శ్రీ: ఎందుకు చేయలేరూ? తప్పకుండా చెయ్యగలరు. చూచారూ, నాకు కొన్నిగంటలుగా తినటానికేమీలేదు.

పై గొంతు: అంతేనా. కొన్ని నెలలుగా తినటానికి లేనివాళ్లున్నారు. ఇదేం వింత! మన దేశాన్నావహించిన కరువు పిశాచి అలాంటిది. మనమేం చేయగలం?

శ్రీ: మొదటే మనవి చేసుకున్నాను, మీరు తల్చుకుంటే చెయ్యగలరని. నాకో రూపాయి యియ్యలేరూ మీరు? నాచూపులకే గొప్పగా కనిపిస్తున్నారంటే, మీరు కొన్ని వేల రూపాయలకు అధిపతులై వుండాలి!

పై గొంతు: బాగు బాగు! యేదో తమాషాగా వున్నట్టుంటే సలహా ఏమైనా కావాలేమో, అంతర్జాతీయ సమస్యలకు వలెనని అడిగాను గాని, యిట్లా యింత నీచంగా—ఛీ,...ఛీ—

శ్రీ: వెళ్లిపోతున్నావుటోయ్ పెద్దమనిషీ. ఇంతేనా నీ సహకారం. పైగా నీచమంటావా? ఛీ. ఒక్క నిమిషం పక్కవాడికి సహాయంగా నిలవలేని నువ్వు యెందుకు పనికొస్తావ్? ఈ ప్రపంచం యింతకుముందు నేను నిర్ణయించుకున్నట్లు యెందుకూ పనికిరానిదే. నా బోటివాడికి ముఖ్యంగా. ఇట్టి ప్రపంచంలో బ్రతికేం బ్రతక్కేం?... అయినా చూస్తాను.